## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన ఆర్థిక సహాయాన్ని నలుగురికి గురువారం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అందజేశారు. నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని, చెక్కులను ఎంపీ భరత్ అందజేశారు. మోకాలి చికిత్స చేయించుకున్న బత్తుల సూర్యకాంతానికి రూ.1.20 లక్షలు, మంచాల సూర్యకుమారికి రూ.60 వేలు, జాలెం అరుణకుమారికి రూ.లక్ష, వేపడ శ్రీనివాస్‌కు రూ.35 వేల విలువైన చెక్కులను ఎంపీ భరత్‌రామ్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్తి లక్ష్మి, పాలిక శ్రీను చేతుల మీదుగా అందజేశారు.

### నేటి నుంచి పోలేరమ్మ జాతర



మాతృశ్రీ పోలేరమ్మ వారు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి గ్రామ దేవత మాతృశ్రీ పోలేరమ్మ వారి జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి 11వ తేదీ వరకూ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయి లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఉదయం కలశ ప్రతిష్ఠ అనంతరం గరగ నృత్యాలు జరుగుతాయన్నారు. సాయంత్రం భజన కార్యక్రమం ఉంటుందన్నారు. 8న ఉదయం కుంకుమ పూజలు, సాయంత్రం కోలాటం, 9న కుంకుమ పూజలు, 10న చండీ హోమం, 11న సాయంత్రం గరగ నృత్యాలతో జాతర జరుగుతుందన్నారు. 21న అన్నసమారాధన నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలను ఉపాధ్యక్షుడు బాలిన వేణు, ప్రధాన కార్యదర్శి లింగం వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి చిత్రపు వీర్రాజు, కోశాధికారి యేమిరెడ్డి సత్యనారాయణ, సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

**వైభవంగా వనువులమ్మ తీర్థం**

కడియం: కడియం గ్రామ దేవత శ్రీవనువులమ్మవారి తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

### ఘనంగా చక్రస్నానం



రామపాదాల రేవులో వేంకటేశ్వరస్వామివారి చక్రస్నానం

ధవళేశ్వరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఉదయం నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామిని ఊరేగింపుగా రామపాదాల రేవుకు తీసుకువచ్చారు. రేవులో చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్ (శివ), ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్య శిబిరం

కంబాలచెరువు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డీఎంహెచ్‌వో సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గౌతమి జీవ కారుణ్య సంఘంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ వృద్ధులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. శిబిరంలో వృద్ధులకు ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య నిపుణులు వంశీ, పవన్‌కిశోర్, మేరీ వసంత, మృదుల, మనోజ్, లలిత తదితరులు సేవలందించారు.

### నిత్యావసరాల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలోని బిలాల్ మసీదు ఆవరణలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గురువారం పేద ముస్లిం మహిళలకు 13 రకాల సరుకులను రంజాన్ తోఫాగా అందజేశారు. నూర్ బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్ అభ్యర్థన మేరకు మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో మాజీ సర్పంచ్ మత్స్యేటి ప్రసాద్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో ముజిబుర్ రెహమాన్, ఇర్ఫాన్, ధన్నావల్లి తదితరులు పాల్గొన్నారు.

# మురిపించెన్ [sic: మురిపింఛెన్]

- ఇంటింటికీ వెళ్లి సొమ్ము పంపిణీ
- అనుకున్న లక్ష్యం పూర్తి
- సత్ఫలితాలిస్తున్న వలంటీర్ వ్యవస్థ



దివ్యాంగునికి పింఛను సొమ్ము అందజేస్తున్న వలంటీర్

రాజమహేంద్రవరం రూరల్: పింఛను సొమ్ము తీసుకోవాలంటే గంటల తరబడి పడిగాపులు.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు.. పనులు మానుకుని వ్యయ ప్రయాసలు.. ఇది ఒకప్పటి మాట. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్ల నుంచి విప్లవాత్మక మార్పు వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికెళ్లి మరీ పింఛన్లు అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారుల మోములో దరహాసం వచ్చింది.. ప్రతి నెలా మొదటి రోజునే పింఛను సొమ్ము ఇంటికి వచ్చి మరీ అందిస్తుండడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. అధికారుల పర్యవేక్షణలో వలంటీర్ల సారథ్యంలో పింఛన్ల పంపిణీ ప్రతి నెలా సజావుగా సాగిపోతోంది.. ఎలాంటి ఇబ్బంది లేకుండా, లబ్ధిదారుల నుంచి మాట రాకుండా పక్కాగా జరుగుతోంది. రాజమహేంద్రవరం అర్బన్‌లో 29,154 మంది పింఛనుదారులు ఉండగా 28,787 మందికి రూ.80.64 లక్షలు పంపిణీ చేశారు. దీంతో 98.74 శాతం పూర్తయింది. రాజమహేంద్రవరం రూరల్‌లో 19,142 మంది లబ్ధిదారులు ఉండగా 18,568 మందికి రూ.51.80 లక్షలు అందజేసి 97 శాతం పంపిణీ చేశారు. కడియం మండలంలో 11,872 మంది పింఛనుదారులకు గాను 11,654 మందికి రూ. 32.21 లక్షలు అందజేశారు. దీంతో 98.16 శాతానికి చేరుకున్నారు. ఈ నెలలో మొదట రెండు రోజులు బ్యాంకులకు సెలవులు వచ్చాయి. మూడో తేదీ సోమవారం నుంచి వలంటీర్లు వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీని ప్రారంభించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. నాలుగు రోజుల్లోనే రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం మండలాల్లో పింఛన్ల పంపిణీని దాదాపు పూర్తి చేయడంతో లబ్ధిదారుల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. ఈ నెల 3న మధ్యాహ్నం నుంచి వలంటీర్లు పింఛన్లు పంపిణీ కార్యక్రమం ప్రారంభించి లబ్ధిదారులకు నగదు అందజేశారు. సుదూర ప్రాంతాలు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పింఛన్‌దారుల వద్దకు వలంటీర్లు స్వయంగా వెళ్లి నగదును అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

**వేగంగా పంపిణీ**

ఏప్రిల్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా వేగంగా పూర్తి చేస్తున్నాం. ఇంకా కొంతమందికి మాత్రమే పింఛన్ల సొమ్ము అందజేయాల్సి ఉంది. ఇందులో కొంతమంది అందుబాటులో లేకపోవడంతో ఆలస్యమైంది. మిగిలిన వారికి శుక్రవారం పింఛన్ల పంపిణీ చేస్తాం.

– కె.రత్నకుమారి, ఎంపీడీఓ, కడియం, రాజమహేంద్రవరం రూరల్

# మహిళల ప్రగతే సీఎం జగన్ లక్ష్యం

**ఎంపీ మార్గాని భరత్‌రామ్**



వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా సీఎం జగన్ అనుక్షణం శ్రమిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. గురువారం స్థానిక తాడితోట వాంబే గృహాల సమీపంలోని జీవీ మాల్‌లో 12, 14, 15 డివిజన్‌లు, సిమెంట్రీ పేట చర్చి వద్ద 6, 7, 13 డివిజన్లకు నిర్వహించిన వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో పేదలు, మహిళల సంక్షేమానికి సుమారు రూ.3 లక్షల కోట్లు అందజేశారన్నారు. దేశ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా సంక్షేమ పథకాలను మహా యజ్ఞంలా అమలు చేస్తున్నారన్నారు. ఇది ఓర్వలేని ప్రతిపక్ష టీడీపీ లేనిపోని విమర్శలు చేస్తుందన్నారు. నగరంలో ఈ నాలుగేళ్లలో జగనన్న ప్రోత్సాహంతో చేసిన అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లబ్ధిదారులకు వివరించారు. గతంలో టీడీపీ నేతలు నగరంలో ఎటువంటి అభివృద్ధి పనులూ చేయలేదని అన్నారు. 2024లో జరిగే ఎన్నికలలో సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేష్‌లకు అధికారం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ఇన్‌చార్జ్ పోలు విజయలక్ష్మి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, ఆయా వార్డుల ఇన్‌ఛార్జులు కొయ్యన పెద్దిరాజు, ఈతకోట బాపన సుధారాణి, ముత్యాల వీర అప్పారావు, బురిడి త్రిమూర్తులు, ఎండీ రఫీ గౌస్, మార్తి లక్ష్మి పాల్గొన్నారు.



# నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'



'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, పార్టీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: 'జగనన్నే మా భవిష్యత్తు', 'మా నమ్మకం నువ్వే జగనన్నా' నినాదంతో ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. గురువారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో 'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టర్లను ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు సీఎం జగన్ అడుగులు వేస్తున్నారని, అందులో భాగంగానే పేదలకు సంక్షేమ పథకాలను మహా యజ్ఞంలా అందజేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర జనాభాలోని 5 కోట్ల మందిలో 87 శాతం ప్రజలు సంక్షేమ ఫలాలను పొందుతున్నారన్నారు. వారందరికీ జగనన్న ఒక నమ్మకం, కొండంత భరోసా అన్నారు. వారంతా 'జగనన్నే మా భవిష్యత్తు అని చెబుతున్నారన్నారు. ఇవి ప్రజల గుండెల్లోంచి వచ్చిన మాటలని.. అదే నినాదంతో వారి వద్దకు వెళ్తున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు కాలేదని, దమ్మున్న నాయకుడు జగనన్న అని ఎంపీ భరత్ కొనియాడారు. రాష్ట్రంలో జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో సంక్షేమ పథకాల పేరుతో లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలోకి నేరుగా రూ.2.97 లక్షల కోట్లు జమ చేశారన్నారు. గత టీడీపీ హయాంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని, ఎంత సేపూ దోచుకున్నామా, దాచుకున్నామా అనే ధోరణితోనే వ్యవహరించారని ధ్వజమెత్తారు. చంద్రబాబు మోసపూరిత మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అందుకే జగనన్నే మా భవిష్యత్తు అంటున్నారని ఎంపీ తెలిపారు. నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, సిటీ మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఖాదీ బోర్డు వైస్ చైర్‌పర్సన్ పిల్లి నిర్మల, వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరిఫ్, గౌడ శెట్టిబలిజ ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, సిటీ యూత్ అధ్యక్షుడు పీతా రామకృష్ణ, ఎన్వీ శ్రీనివాస్, మార్గాని సురేష్, పోలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజంలో తగిన గుర్తింపు



సమైక్య యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాంబాబు తదితరులు

సీటీఆర్ఐ: విద్యతోనే ప్రతి ఒక్కరికీ సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక చైర్మన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. స్థానిక 48వ డివిజన్‌లో అజ్జరపు వాసు కార్యాలయం వద్ద గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నగరంలో అంబేడ్కర్ జయంతి ఉత్సవ సమైక్య యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా గుర్తింపు సాధించారంటే అందుకు చదువే కారణమన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానంతో సమాజాభివృద్ధిలో తమ వంతు బాధ్యత నెరవేర్చేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యవేదిక కృషి చేస్తుందన్నారు. ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని వై.జంక్షన్ నుంచి గోకవరం బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం వరకూ సమైక్య యాత్రను నిర్వహిస్తామన్నారు. కన్వీనర్ అజ్జరపు వాసు, కన్వీనర్లు వైరాల అప్పారావు, అమీర్ పాష, సమ్మతం గన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోదీ విధానాలతో దేశ ప్రగతి



బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని మోదీ విధానాలతో దేశం ప్రగతి పథాన పయనిస్తుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యురాలు రేలంగి శ్రీదేవి, చింతాలమ్మ, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పన్నాల లక్ష్మీసంతోషి, రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షులు బేతిరెడ్డి ఆదిత్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మల్లయ్యపేటలో బీజేపీ స్తూపం వద్ద ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని అసెంబ్లీ కోకన్వీనర్ యనాపు ఏసు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కోశాధికారి పిచ్చిగా వెంకట రాంబాబు, కందెల్ల రామారావు, ఆకుల నరసవేణి, వసుంధర, డాక్టర్ సూరిబాబు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక ఎర్రకొండపై బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పన్నాల లక్ష్మీసంతోషి, డాక్టర్ జి.కొండలరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గామోహన్, వేమగిరి గనిరాజు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువలో వైద్యం

- రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం



కడియంలో ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రారంభిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసిందని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక వినాయకుడి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజుతో కలిసి చందన పాల్గొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ 104 వాహనం ద్వారా నెలలో రెండు రోజులు ప్రతి గ్రామంలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. వైద్యులే నేరుగా గ్రామాలకు వచ్చి చికిత్స అందజేస్తారని వివరించారు. కడియపులంక ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయన్నారు. అంత వరకూ కడియపులంక సొసైటీ ఆవరణలో హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చందన వివరించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నేరుగా వైద్యులే గ్రామాలకు వచ్చి వైద్యం చేస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల పార్టీ అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు మాట్లాడారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ సర్పంచ్‌లు వెలుగుబంటి వెంకటాచలం, దాసరి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు జూదరుల అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.40,300, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని బొమ్మూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. బుధవారం రాత్రి శాటిలైట్‌సిటీలో చప్పిడి శివదుర్గగణేష్, మహ్మద్ రఫీ, ఆకుల విజయకుమార్, పీతల రాంబాబులు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా పట్టుకున్నామని అన్నారు.

# వైభవంగా మహాకాళేశ్వరాలయ వార్షికోత్సవం



మహా కాళేశ్వరాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న పట్టపగలు అనంతలక్ష్మి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటలోని మహాకాళేశ్వరాలయం (మరో ఉజ్జయిని) ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి గణపతి పూజ, గోపూజ, మహాన్యాసం, రుద్రాక్ష అభిషేకం, సాయంత్రం ఐదు గంటలకు కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పం, వేద స్వస్తి నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టపగలు వెంకటరావు సతీమణి అనంతలక్ష్మి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం స్వామివారికి గణపతి పూజ, గోపూజ, పల్లకీసేవ, గోదావరిలో ఉత్సవమూర్తులకు చక్రస్నానం, సాయంత్రం సహస్ర కుంకుమార్చన ఉంటాయని అర్చకుడు ఆదిత్య తెలిపారు.

# కరోనాపై అవగాహన కల్పిద్దాం..



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: మే 8న వరల్డ్ రెడ్‌క్రాస్ డే సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక సంహిత కన్వెన్షన్ హాల్‌లో మేనేజింగ్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 8వ తేదీ నుంచి మే 8 వరకూ రెడ్‌క్రాస్ మెంబర్ షిప్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తామన్నారు. కరోనా తిరిగి విజృంభిస్తున్న నేపథ్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. మేనేజింగ్ కమిటీ సభ్యులు గ్రంధి భాస్కరరావు, గణేష్ రాజు, అనంతలక్ష్మి, డాక్టర్ పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానానికి స్థలం కేటాయింపు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జీ తదితరులు

సీటీఆర్ఐ: బొమ్మూరులోని తహసీల్దార్ కార్యాలయం వెనుక క్రైస్తవ శ్మశానవాటికకు ఆరెకరాలను కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మార్గాని భరత్‌రామ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కమిటీ ప్రతినిధులు పొన్నమాటి బాబ్జి, గుడాల జాన్సన్ తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2005 నుంచి అపరిష్కృతంగా ఉన్న శ్మశానవాటిక సమస్యకు పరిష్కారం చూపారన్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు చాలా మంది దృష్టికి తీసుకు వెళ్లామని, కానీ ఎవరూ చొరవ చూపలేదన్నారు. ఎంపీ భరత్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన సీఎం జగన్‌కు తెలిపి పరిష్కారం చూపడం హర్షణీయమన్నారు. ఈ నెల 9న ఈస్టర్ వేడుకలను అక్కడే నిర్వహిస్తామని తెలిపారు. దీనిని లూథరన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కమిటీ ప్రతినిధులు ఆముదాల పెదబాబు, శ్యామ్‌సన్, జయచంద్ర, ప్రభాకర్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలో వ్యక్తి మృతదేహం

కంబాలచెరువు: స్థానిక కాతేరు, వెంకటనగరం గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం గురువారం లభ్యమైంది. గోదావరి నది ఒడ్డున వ్యక్తి మృతదేహం తేలియాడుతుండడంతో చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. అతని శరీరంపై నలుపు రంగు చొక్కా ఉంది. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

సీతానగరం: నాగంపల్లి, చీపురపల్లిలోని చెరువుల అభివృద్ధి పనులను డ్వామా ఏపీడీ జి.శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. చీపురపల్లిలో కోరావారి చెరువు పనులను 75 మంది ఉపాధి కూలీలు, నాగంపల్లిలో రాముడు చెరువు పనులను 30 మంది కూలీలు చేస్తున్నారు. ఈ పనులను ఏపీఓ కె.నాగశేషవేణితో కలసి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత సరోవర్ కార్యక్రమంలో భాగంగా చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టి, గట్లను పటిష్ట చేయడం, మొక్కలు నాటడానికి సిద్ధం చేస్తున్నామని అన్నారు.